ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024





విజయవాడ బయలుదేరిన మునిలక్ష్మి దంపతులు

● కుప్పం మహిళా రైతు

'ఎర్రకోట' వేడుకలకు అతిథి

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే పంద్రాగస్టు వేడుకలకు కుప్పం మహిళా రైతు ఎస్.మునిలక్ష్మి అతిథిగా హాజరు కానున్నారు. కుప్పం మండలం వెండుగంపల్లెకు చెందిన ఈమె పీఎం కిసాన్ పథకం లబ్ధిదారు. తన భర్త నారాయణతో కలిసి గ్రామంలో ఆమె ఆదర్శ వ్యవసాయం చేస్తున్నారు. కాగా, ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకలకు రాష్ట్రం నుంచి పీఎం కిసాన్ లబ్ధిదారులైన నలుగురు రైతులను అతిథులుగా ఎంపిక చేశారు. వీరిలో చిత్తూరు ఉమ్మడి జిల్లా నుంచి మునిలక్ష్మి ఉన్నారు. మిగిలిన వారు.. పోతుల నాగమణి (ఏలూరు), దోమ మోహన్ (శ్రీకాకుళం), నల్లపు మాల్యాద్రి (ప్రకాశం). కాగా ఎస్.మునిలక్ష్మి దంపతులు ఆదివారం సాయంత్రం కుప్పంనుంచి విజయవాడ బయలుదేరి వెళ్లారు. అక్కడ్నుంచి దురంతో ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి న్యూఢిల్లీ చేరుకుంటారు. ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో అతిథిగా పాల్గొంటారు. మునిలక్ష్మి దంపతులకు టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

- కుప్పం

● నేటి నుంచి 15 వరకు

హర్ ఘర్ తిరంగా

జిల్లా వ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని సోమవారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు జాతీయ జెండాలతో సెల్ఫీ తీసుకుని harghartiranga.com లింక్ ద్వారా పోస్టుచేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో దేశభక్తిని ప్రబోధించే పాటలు, నాటకాలు, ఏకపాత్రాభినయం తదితర కార్యక్రమాలను నిర్వహించాలని డీఈవో, ఆర్‌ఐవో, డీవీఈవోను ఆదేశించారు. 13న డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలు.. డీఎస్డీవో, ఆర్‌ఐవో, డీఈవోల సమన్వయంతో బిగ్ రన్ మారథాన్.. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని పేర్కొన్నారు. 14న మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ.. స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను సన్మానించాలని తెలిపారు. 15న జాతీయ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఎగురవేయాలని సూచించారు.

- చిత్తూరు కలెక్టరేట్

ఇప్పుడూ వాళ్లే కీలకం!

గత ప్రభుత్వంలో తీవ్ర ఆరోపణలున్నా ముఖ్య పోస్టింగులు

తెలిసే సిఫార్సు చేసిన కొందరు ఎమ్మెల్యేలు

తహసీల్దార్ల నియామకంలో తీవ్ర విమర్శలు

వైసీపీ ప్రభుత్వంలో.. ఆ తహసీల్దార్లు ముఖ్య మండలాల్లో చక్రం తిప్పారు. వైసీపీ అనుకూలుర ముద్ర వేసుకున్నారు. ఇష్టారాజ్యంగా పనిచేశారు. రెవెన్యూ అంశాల్లో ఏకపక్షంగా ఉన్నారన్న విమర్శలు వచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చాక.. మళ్లీ ఆ తహసీల్దార్లలో చాలామందికి కీలక పోస్టింగులే వచ్చాయి. నాడు వీరి వైఖరిపై విమర్శలు వచ్చినా.. ఇప్పుడు కొందరు టీడీపీ ఎమ్మెల్యేలే వీరికి అనుకూలంగా సిఫార్సు చేయడం గమనార్హం.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ప్రభుత్వం ఏదైనా.. ఉన్నతాధికారి ఎవరైనా.. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని చెప్తారే తప్ప చేయలేరు. ఆ వ్యవస్థ అలాంటిది మరి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌డేకు వచ్చే అర్జీల్లో 95శాతం రెవెన్యూ సమస్యలే ఉంటాయి. రెవెన్యూ అధికారుల తీరుతో క్షేత్రస్థాయిలో సామాన్యులు నలిగిపోతున్నారు. గత వైసీపీ పాలనలో అయితే పలువురు రెవెన్యూ అధికారులు మరింతగా రెచ్చిపోయారు. ఇష్టానుసారంగా వైసీపీ ఎమ్మెల్యేలకు, నేతలకు విలువైన భూముల్ని దోచిపెట్టారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్లు.. కూటమి ప్రభుత్వంలోనూ కీలక స్థానాల్లో ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అవినీతి ఆరోపణలున్న తహసీల్దార్లను పలువురు కూటమి ఎమ్మెల్యేలు సిఫార్సు చేయడం గమనార్హం. కొందర్ని అయితే కోరి మరీ తమ నియోజకవర్గాల్లో నియమించుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఏ ప్రభుత్వంలోనైనా అవినీతిపరులు అందలం దక్కించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. తాజాగా జిల్లాలో తహసీల్దార్ల నియామకం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

● తవణంపల్లెలో పనిచేసిన తహసీల్దార్ మోహనవల్లి అక్కడ పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు, మ్యూటేషన్ల కోసం అర్హత కలిగిన దరఖాస్తులు వస్తే విచారించకుండా రిజెక్ట్ చేశారు. మరికొన్ని ఇర్రెగ్యులర్‌గా ఉన్నా యాక్సెప్ట్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులు సీసీఎల్ఏకు రిపోర్టు చేయగా.. మూడు ఇంక్రిమెంట్లు కట్ చేశారు. ఇప్పుడు ఆమె కోసం ఓ ఎమ్మెల్యే అడిగితే.. ఉన్నతాధికారులు వద్దని నచ్చజెప్పి పలమనేరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించారు.

● చౌడేపల్లె తహసీల్దారుగా నియమితులైన హనుమంతు గతంలో పెద్దపంజాణి, గంగవరంలో పనిచేశారు. అక్కడ అక్రమంగా పట్టాలిచ్చారని అప్పటి కలెక్టర్ ఇతడిపై సీసీఎల్ఏకు ఫిర్యాదు చేశారు. ఇప్పుడది విచారణ దశలో ఉంది. మళ్లీ ఆయనకు మంచి పోస్టింగ్ దక్కింది.

● తాజాగా గుడిపాల తహసీల్దారుగా నియమితులైన జి.చంద్రశేఖర్ రెడ్డి మీద తీవ్ర ఆరోపణలున్నాయి. ఇతడి తీరుపై ఉన్నతాధికారులూ ఆఫ్‌ది రికార్డుగా తప్పు పడుతుండటం గమనార్హం. వైసీపీ హయాంలో వడమాలపేట, నగరి తహసీల్దారుగా పనిచేసినప్పుడు రోజాకు అత్యంత సన్నిహితుడిగా ఈయన ముద్ర వేసుకున్నారు. ఏపీఐఐసీ భూముల్ని భారీఎత్తున కట్టబెట్టారన్న ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రం చిత్తూరుకు రావాలని ప్రయత్నించగా.. ఉన్నతాధికారులు వద్దని గుడిపాలలో పోస్టింగ్ ఇచ్చారు.

● జీడీనెల్లూరు తహసీల్దారుగా నియమితులైన చంద్రశేఖర్ మీదా అనేక ఆరోపణలున్నాయి. వైసీపీ హయాంలో పెనుమూరు, సదుం మండలాల్లో పనిచేశారు. పెనుమూరులోని 430 సర్వే నెంబరులో అనర్హులైన వైసీపీ నాయకులకు 3 నుంచి 5 సెంట్ల వరకు అక్రమంగా పట్టాలిచ్చారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఇప్పటికీ స్థానికంగా వివాదం రగులుతూనే ఉంది. ఎమ్మెల్యే థామస్ కూడా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ఉన్నతాధికారులు విచారిస్తున్నారు. దీంతో పాటు భూపంపిణీ లేకుండానే సుమారు 15 మందికి 40 ఎకరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాసుపుస్తకాలను ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. పెనుమూరు తీవ్ర ఆరోపణలు రావడంతో అప్పట్లో సదుంకు బదిలీ చేశారు. ఈయనకు మళ్లీ నియోజకవర్గ కేంద్రమైన జీడీనెల్లూరులో పోస్టింగ్ దక్కింది.

● జిల్లాలో కీలకమైన వి.కోట తహసీల్దారుగా నియామకమైన పార్వతి అవినీతి గురించి ఉన్నతాధికారులు సైతం ఖంగుతింటున్నారు. ఆమె వైసీపీ హయాంలో శాంతిపురం, కుప్పం, చిత్తూరు మండలాల్లో పనిచేశారు. ఈ మూడు ప్రాంతాల్లోనూ ఆమె అవినీతి గురించి ఇప్పటికీ చెప్పుకుంటున్నారు. శాంతిపురంలో కొవిడ్ సమయంలో కింది స్థాయి సిబ్బందితో ఖర్చు పెట్టించి, ప్రభుత్వం ఇచ్చిన నిధుల్ని వాడేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈమె అవినీతి భరించలేక స్థానిక వైసీపీ నేతలు పంపించేశారని అప్పట్లో ప్రచారం జరిగింది. వైసీపీ హయాంలో కీలకమైన మూడు మండలాల్లో పనిచేసిన ఆమె, ఇప్పుడు టీడీపీ హయాంలోనూ కీలకమైన వి.కోటలో పోస్టింగ్ లభించడం చర్చనీయాంశంగా మారింది.

● నగరి తహసీల్దారుగా నియమితులైన రవికుమార్ గతంలో కార్వేటినగరంలో పనిచేశారు. ఏకపక్షంగా పనిచేసినట్లు తీవ్ర విమర్శలున్నా.. ఇతడికి నియోజకవర్గ కేంద్రం లభించింది.గుడిపాలలో పనిచేస్తూ ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్న బాబూ రాజేంద్రప్రసాద్ ఇప్పుడు బంగారుపాళ్యం తహసీల్దారుగా పోస్టింగ్ లభించింది.

9 మండలాల్లో ఇన్‌చార్జుల పాలన

జిల్లాలో 8 తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. మురళీమోహన్ అనే తహసీల్దార్ మీద తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో అతడికి పోస్టింగ్ ఇవ్వకుండా కలెక్టరేట్‌కే పరిమితం చేశారు. ఇప్పటికే 8 ఖాళీలుండగా.. ఈయనకు పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఈ సంఖ్య 9కి చేరింది. పూతలపట్టు నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా .. యాదమరి, ఐరాల, తవణంపల్లెలో డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జులుగా ఉంటున్నారు. ఇక, విజయపురం, వెదురుకుప్పం, పెనుమూరు, గంగవరం, పెద్దపంజాణి, సదుం మండలాల్లోనూ డిప్యూటీ తహసీల్దార్లనే ఇన్‌చార్జిలుగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

నేటి నుంచి టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

● 14 నాటికి ప్రక్రియ పూర్తి

● పరిగణనలోకి ఉపాధ్యాయ సంఘాల సూచనలు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 11: పాఠశాల విద్యా వ్యవస్థలో సాంకేతిక, ఇతర కారణాలతో వాయిదాపడిన టీచర్ల పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియ సోమవారం నుంచి మొదలు కానుంది. ఉపాధ్యాయ సంఘాల సలహాలు, సూచనల మేరకు ఉత్తర్వుల్లో స్వల్ప మార్పులు చేస్తూ ప్రక్రియను ఈనెల 14వ తేదీలోపు పూర్తి చేయనుంది. పీపుల్-టీచర్ రేషియో (పీటీఆర్)లో 2024 ఆగస్టు 7వ తేదీ కాకుండా ఆగస్టు 9వ తేదీ యూడైస్ ఆధారంగా ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపాలిటీ యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), పీడీ, పీఈటీ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేపట్టనున్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు ఈ ప్రక్రియ నుంచి మినహాయింపు ఇచ్చారు.

రేపటి నుంచి స్టాఫ్‌నర్సు పోస్టులకు కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్, ఆగస్టు 11: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా పనిచేసేందుకు ఎంపికైన 206 మందికి మంగళవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9440290777, 9381905037లను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు రిలీవ్‌కానున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 11: జేసీ పులి శ్రీనివాసులు మంగళవారం సాయంత్రం రిలీవ్‌కానున్నారు. బుధవారం గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన స్థానంలో కొత్త జేసీగా ప్రభుత్వం నియమించలేదు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల వేదికలో పాల్గొంటారు. మధ్యాహ్నం కలెక్టర్‌తో కలిసి ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణపై తహసీల్దార్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేస్తారు.

ఉత్సవ ఆహ్వాన పత్రికను చిత్తు కాగితంలో ఇస్తారా?

అధికారులపై కాణిపాక ఆలయ ఉభయదారుల ఆగ్రహం

ఇదేనా మీరిచ్చే గౌరవం?



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో వెంకటేశు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 11: ఏటా కాణిపాక వినాయకస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను తొలుతగా ఉభయదారులకు ఇస్తారు. సమావేశంలో బుక్‌లెట్ రూపంలో ముద్రించి అందజేస్తారు. దీనిని ఉభయదారులు గౌరవంగా భావిస్తారు. ఇందులో పొరబాట్లు ఉంటే వీరు అధికారుల దృష్టికి తీసుకెళతారు. ఆ తర్వాత ఆహ్వాన పత్రికలను ముద్రణకు పంపుతారు. ఇప్పుడు సెప్టెంబరు 7వ తేది నుంచి మొదలయ్యే బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి ఆదివారం మధ్యాహ్నం మణికంఠేశ్వరస్వామి ఆలయంలో 14 గ్రామాలకు చెందిన ఉభయదారులతో ఈవో వెంకటేశు సమావేశం నిర్వహించారు. ఆహ్వాన పత్రికను ఓ కాగితంలో ప్రింట్ చేసి ఇవ్వడంతో వీరు ఆగ్రహించారు. ఉభయదారులకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ అధికారులను నిలదీశారు. ఇక, బ్రహ్మోత్సవ పత్రికను వేదపండితుడు చదువుతుండగా.. కొందరు ఉభయదారులు అభ్యంతరం తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను రాసి వారి తరఫున చదివి వినిపించడం ఆనవాయితీ అని గుర్తుచేశారు. దీనిపై స్పందించిన ఈవో వెంకటేశు ఈ విషయం కోర్టులో ఉన్నందున ఏమీ మాట్లాడలేమన్నారు. రథోత్సవ ఉభయదారులైన గాలిమునస్వామినాయుడు కుమార్తె మీనాకుమారి ఉభయ వరసను తెచ్చేలా అవకాశం కల్పించాలని వారు కోరారు. అలాగే బ్రహ్మోత్సవ కాలంలో స్వామి అలంకరణను ప్రస్తుతమున్న స్వాములు సక్రమంగా నిర్వహించడం లేదని, గతంలో అలంకరణ చేపట్టిన ధర్మేశ్వరగురుకుల్‌కు ఆ బాధ్యతను అప్పగించాలని ఉభయదారులు సూచించారు. ధర్మేశ్వరగురుకుల్ తప్పేమీ లేకపోయినా ఆయన్ను ఎందుకు విధులకు రానివ్వడం లేదని కొందరు ఉభయదారులు అధికారులను ప్రశ్నించారు. ఆయన్ను సస్పెండ్ చేయడానికి కారణమైన నగలను భద్రపరచ వలసిన బాధ్యత అధికారులదైనప్పుడు ఆయనను ఎందుకు సస్పెండ్ చేశారో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచి శాంతిసాగర్‌రెడ్డి, ఉభయదారుల సంఘ అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, ఆలయ మాజీ ఛైర్మన్లు మోహన్‌నాయుడు, మణినాయుడు, మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ధనంజయ, సూపరింటుండెంట్లు కోదండపాణి, వాసు, 14 గ్రామాలకు చెందిన ఆలయ ఉభయదారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆగ్రహించిన ఉభయదారులు

ఆలయానికి రంగులు

వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కాణిపాకంలోని ప్రధాన ఆలయానికి రంగులు వేసే పనులను ప్రారంభించారు. ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వరాలయం, వరదరాజస్వామి ఆలయాలకు రంగులు వేస్తున్నారు. ఈ పనులు మరో పది రోజులలో పూర్తి కానున్నాయి.



ప్రధాన ఆలయ రాజగోపురానికి రంగులు వేస్తున్న కూలీలు

7 నుంచి కాణిపాక బ్రహ్మోత్సవాలు

కాణిపాక వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను సెప్టెంబరు 7 నుంచి 27వ తేది వరకు నిర్వహించనున్నారు. 7న శనివారం వినాయక చవితి, పుష్పకావళ్ల సమర్పణ, 8న ధ్వజారోహణం, రాత్రి హంస.. 9న స్వర్ణ నెమలి.. 10న మూషిక.. 11న ఉదయం స్వర్ణ చినశేష.. రాత్రి స్వర్ణ పెద శేష వాహన సేవలు.. 12న ఉదయం చిలుక వాహనం, రాత్రి వృషభ వాహనం, 13న గజ వాహనసేవ.. 14న రథోత్సవం, 15న ఉదయం బిక్షాండి ఉత్సవం, సాయంత్రం స్వామి వారి తిరుకల్యాణం, రాత్రి అశ్వ వాహనం.. 16న సాయంత్రం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, రాత్రి స్వామికి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 17న రాత్రి అధికారనంది.. 18న రాత్రి రావణబ్రహ్మ.. 19న రాత్రి యాళి.. 20న విమానోత్సవం.. 21న పుష్పపల్లకి సేవ.. 22న కామధేను.. 23న రాత్రి సూర్య ప్రభ.. 24న రాత్రి చంద్రప్రభ.. 25న రాత్రి కల్పవృక్ష.. 26న రాత్రి పూలంగి సేవ, 27న రాత్రి తెప్పోత్సవంతో ముగుస్తాయి.

16నుంచి రెవెన్యూ సదస్సులు

● 15న జిల్లామంత్రిచే లాంఛనంగా ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 11: దీర్ఘకాలం తర్వాత మళ్లీ రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు గ్రామగ్రామాన సదస్సులు నిర్వహించాలని రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్లను సూచించింది. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో బృందాలను నియమించి, ప్రతి రెవిన్యూ గ్రామంలో పర్యటించి భూఆక్రమణ, 22ఏ భూముల తారుమారుకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించాలని ఆదేశించింది. ఇందుకోసం జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించనుంది. ఆ అధికారే షెడ్యూల్ గ్రామ, మండల స్థాయి ఫిర్యాదుల స్వీకారం, పరిష్కారాలను ఫైనల్ చేస్తారు. అన్ని ఫిర్యాదులను ఆర్టీజీఎస్ జీఆర్పీలో నమోదుచేస్తారు. ఆగస్టు 15న సదస్సులను జిల్లా మంత్రి సత్యకుమార్ యాదవ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. సదస్సులకు కోఆర్డినేటర్‌గా జేసీ వ్యవహరిస్తారు. ఆర్డీవోలు, తహసీల్దార్లను షెడ్యూల్ రూపొందించి ఈనెల 13లోగా నివేదించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సదస్సు నిర్వహణకు ఎక్కువ విస్తీర్ణం కలిగిన గ్రామాలకు ఒకరోజు, ఇతర గ్రామాలకు ఒక పూట కేటాయిస్తారు. గ్రామస్థాయి బృందంలో తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్, రిజిస్ట్రేషన్, అటవీ, దేవదాయ, వక్ఫ్‌బోర్డుల నుంచి ప్రతినిధులు ఉంటారు. ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని కలెక్టర్ నియమిస్తారు. ఇందుకోసం జిల్లాకు ప్రభుత్వం రూ.8 లక్షలను విడుదల చేసింది. రెవెన్యూ సదస్సులకు వెళ్ళేటప్పుడు గ్రామ చిత్రపటాలు, ఆర్వోఆర్, 1-బీ, అడంగళ్, పహాని, ప్రభుత్వ భూమి కాపీలు, వెబ్‌ల్యాండ్ నుంచి ముద్రించినవి తీసుకొనివెళ్ళాలి. ఉదయం 9 గంటలకే ప్రతి గ్రామంలో సదస్సు ప్రారంభిస్తారు. పిటిషన్లకు సంబంధించి తహసీల్దార్ విచారణ, రీసర్వే, కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ, సరిహద్దు రాళ్లపై బొమ్మలు, పేర్లు ఉంటే చెరిపివేయడం వంటివి చేస్తారు. వైసీపీ హయాంలో 22ఏ భూములు, అసైన్మెంట్ భూములు చాలావరకు ఫ్రీహోల్డ్ చేశారు. ఇవి చాలావరకు వైసీపీ నాయకులకు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులకు మేలు చేయడానికే అన్న ఆరోపణలున్నాయి. వీటినీ సదస్సుల ద్వారా బయటకు తీయనున్నారు.



అక్క గజలక్ష్మితో కలిసి కడా కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పేద రైతు మురుగేశ్

ఆ భూమి మాదే సామీ!

● సొంత భూమి పరిరక్షణకు పేద కుటుంబం పాట్లు

కుప్పం, ఆగస్టు 11: సొంత భూమిని కాపాడుకోవడానికి ఓ పేద రైతు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అగచాట్లు పడుతున్న వైనమిది. వివరాలిలా ఉన్నాయి. కుప్పం మండలం నడిమూరుకు చెందిన మురుగేశ్‌కు అదే గ్రామం సర్వే నెంబరు 195లో 1.2 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటనలో మురుగేశ్ ప్రత్యర్థులైన అతడి దాయాదులు కొందరు ఈ భూమిపై ఫిర్యాదు చేశారు. ఇదే సాకుగా తీసుకున్న క్షేత్రస్థాయి కొందరు రెవెన్యూ సిబ్బంది గతంలో ఇచ్చిన పట్టాను రద్దు చేసి, మురుగేశ్ ప్రత్యర్థులకు సాయం చేసి లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రామకుప్పం కుమారుడైన కన్నప్ప తన కుమారుడైన మురుగేశ్‌కు 195 సర్వే నెంబరులో గల 1.2 ఎకరాల భూమిని రాసి ఇచ్చారు. 50 ఏళ్లుగా ఈ భూమి, ఈ ముగ్గురి అనుభవంలో ఉంటూ ఒకరినుంచి మరొకరికి మారుతూ వస్తోంది. 2020లో వాస్తవ రికార్డులు పరిశీలించిన రెవెన్యూ అధికారులు మురుగేశ్‌ను యజమానిగా నిర్ణయిస్తూ పట్టాదారు పాసుపుస్తకం కూడా మంజూరు చేశారు. 1-బీ అడంగల్ మురుగేశ్ పేరు మీదే ఉంది. విజయవాడ నుంచి ధర్మపురికి పెట్రోల్ తదితర పదార్థాల రవాణాకు పైపులైను నిర్మించే క్రమంలో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంబంధిత భూమిలో 10 సెంట్లు కావాలని 2018లోమురుగేశ్ తండ్రి కన్నప్పకు నోటీసులు జారీ చేసింది. గతేడాది మురుగేశ్ భూమిలో అతని దాయాదులు ప్రవేశించి దౌర్జన్యం చేసిన కేసులో ఆ భూమి మురుగేశ్‌దేనని అప్పటి తహసీల్దారు పార్వతి ధ్రువీకరించారు. ఆమె కుప్పం అర్బన్ పోలీసులకు ఇదే విషయాన్ని తెలియజేశారు. ఇన్ని సాక్ష్యాలున్నా గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది మురుగేశ్‌కు భూమిని దక్కకుండా ప్రయత్నిస్తున్నారు. ఈ సాక్ష్యాలను ఉన్నతాధికారుల దృష్టికి తేకుండా పక్కదారి పట్టించి భూమికి సంబంధించి ఎటువంటి వివరాలు రాకుండా ఆన్‌లైన్‌లో లాక్ చేశారు. దీనిపై కడా ఎస్వో వికాస్ మర్మత్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. సొంత భూమిని గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది నుంచి రక్షించుకోవడానికి మురుగేశ్, అతడి సోదరి గజలక్ష్మి కలిసి కడాతో పాటు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, ఆగస్టు 11: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పక హాజరుకావాలన్నారు. అలాగే చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ఉంటుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు.

నాటుబాంబుల కలకలం

● మణిపిరెడ్డిపల్లెలో 26 స్వాధీనం ● పోలీసుల అదుపులో ఇద్దరు


స్వాధీనం చేసుకున్న నాటుబాంబులు

పాకాల, ఆగస్టు 11: పాకాల మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డిపల్లెలో నాటుబాంబులు కలకలం సృష్టించాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మణిపిరెడ్డిపల్లె రైల్వేగేటు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఓ ఇంట్లో ఆదివారం 26 నాటుబాంబులను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని తయారు చేస్తున్న బాబు, గజేంద్రలను అదుపులోకి తీసుకున్నారు. పందుల పెంపకంతో జీవనం సాగిస్తున్న వీరు అడవి పందులను వేటాడడానికి నాటుబాంబులు తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. గుండ్రంగా ఉండే ఈ బాంబులను అడవి పందులు సంచరించే ప్రదేశాల్లో పెడతారు. అవి తినడానికి ప్రయత్నించినపుడు పేలి అడవి పంది ముఖం ఛిద్రమవుతుంది. ఆ తర్వాత పందిని స్వాధీనం చేసుకుని, దాని మాంసాన్ని వీరు విక్రయిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


నిందితులు గజేంద్ర, బాబు

జిల్లాలో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 11: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. తవణంపల్లెలో 3.0, శ్రీరంగరాజపురం 1.8, కుప్పం 1.4, చిత్తూరు అర్బన్‌లో 1.2 మి.మీ వర్షం కురిసింది.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా : కలెక్టర్


ఎస్టీయూ నేతలతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 11: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం జడ్పీ కార్యాలయం ఎదుట ఎస్టీయూ మహాధర్నా చేపట్టనున్న నేపథ్యంలో కలెక్టర్ స్పందించి జడ్పీ చైర్మన్, సీఈవోలతో ఆదివారం మధ్యాహ్నం చర్చించారు. సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్టీయూ నేతలతో సమావేశమయ్యారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ జీపీఎఫ్ తరహాలో జడ్పీ పీఎఫ్‌ను మెరుగుపరచాలని కోరారు. జడ్పీ పీఎఫ్ నిర్వహణ లోపాల వల్ల పీఎఫ్ స్లిప్పులు అందుబాటులోకి రావడం లేదని చెప్పారు. తద్వారా పీఎఫ్ రుణాలు, తుది మొత్తాలు తీసుకోవాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. టీచర్ల సర్వీసు రెగ్యులరైజేషన్ జాబితాల విడుదలలో జాప్యం జరుగుతోందని, తద్వారా పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతుందని ఆందోళన వెలిబుచ్చారు. పాఠశాలల స్థలాలను సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించాలన్నారు. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో మహాధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా శాఖ ప్రకటించింది. ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియా, ఎస్టీయూ నేతలు పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, మంజునాథ్, లింగయ్య, కమలాపతి పాల్గొన్నారు.


ఘనంగా ఎద్దుల పరుగు పందెం పండుగ


పశువులు పరుగు పందెంలో బారికేట్లు మధ్యలోని బాజీలో పరుగులు తీస్తున్న ఎద్దు

శాంతిపురం, ఆగస్టు 11 : తిమ్మరాజుపల్లె సమీపంలోని అంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం ఎద్దుల పరుగు పందెం పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం రంగు రంగుల కాగితాలతో పశువులనుముస్తాబు చేశారు. తరువాత సాంప్రదాయంగా వీధుల్లో తోరణం కింద జంతు బలులిచ్చి బాజీలో పశువులను పరిగెత్తించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యారికేట్ల బాజీలో పరుగు పందెం నిర్వహించారు. పోటీలో పాల్గొనేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భారీ ఎత్తున ఎద్దులను తీసుకువచ్చారు. మొదటి బహుమతి రూ.1,00,000 కాగా రెండవ బహుమతి రూ.90,000గా నిర్ణయించారు. సుమారు 50 బహుమతులతో పోటీలు నిర్వహించారు. సుమారు 500 ఎద్దులు పోటీలలో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎద్దుల పండుగ ప్రశాంతంగా జరిగింది. దేవాలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. సాయంత్రం విజేత ఎద్దు యజమానులకు బహుమతులు అందజేశారు.

నగరపాలక అధికారులపై 'విజిలెన్స్'

● టీడీఆర్ బాండ్ల జారీ, నిధులు దుర్వినియోగం చేసిన అధికారుల్లో గుబులు
● విచారణకు ఆదేశించిన మంత్రి నారాయణ



తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ మంత్రి నారాయణ ఆదేశించారు. ఆమేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి విభాగపు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి నగర పాలక సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజాదర్బార్ (ఆర్టీజీ)లో భాగంగా మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. ఈక్రమంలో మంత్రి నారాయణకు తిరుపతి కార్పొరేషన్లోని అవినీతి అధికారుల గుట్టు విప్పాలని మంత్రి లోకేశ్ ద్వారా ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ నారాయణ నిర్ణయం తీసుకోవడంతో అవినీతి అధికారుల్లో గుబులు పట్టుకుంది. తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. రూ.4వేల కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్టు అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపించారు. అభివృద్ధి పేరుతో తుడా వేయాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్లను పక్కా ప్రణాళికతో తెరపైకి తీసుకొచ్చి స్థలాలు కోల్పోయిన వారి పేర్లతో బాండ్లు తీసుకుని కోట్లు కొల్లగొట్టారు. అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధి పొందారు. వైసీపీ నేతల జేబుల్లోకి దాదాపు రూ.400 కోట్ల వరకు వెళ్లినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగంలో ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగమయ్యాయన్న విమర్శలూ ఉన్నాయి. ఇక గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులపై కూడా విచారణ జరగనున్నట్టు తెలుస్తోంది.

గుత్తార్లపల్లెలో ఆక్రమణదారుల దౌర్జన్యం

● ప్రశ్నించిన వీఆర్వోపై దాడి



వడ్డెవానిగుట్టలో వీఆర్వోతో ఘర్షణ పడుతున్న ఆక్రమణదారులు - గాయపడి చికిత్స పొందుతున్న వీఆర్వో కుమార్ - ఆక్రమిత భూమిలో కొబ్బరి మొక్కలు

గుడుపల్లె, ఆగస్టు 11: ఆక్రమణదారుల ఆగడాలకు అంతూపొంతూ లేకుండాపోతోంది. తమను ప్రశ్నించారనే కోపంతో వీఆర్వోపై దాడి చేసి గాయపరిచారు. వివరాలివి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు...కుప్పం-గుడుపల్లె ప్రధాన రహదారి గుత్తార్లపల్లెకు కొంత దూరంలో సర్వే నెంబరు 62లోని, 15.20 ఎకరాల విస్తీర్ణంలో వడ్డెవానిగుట్ట భూమి రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఈ గుట్ట భూమిలో కుప్పానికి చెందిన వైసీపీ నాయకుడు అక్రమంగా క్వారీని నిర్వహించాడు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో వైసీపీ నాయకుడు క్వారీ పనులను ఆపేశాడు. ఆ తరువాత గ్రామస్థులు వడ్డెవానికుంట భూమిని ప్రభుత్వ, ప్రజల అవసరాల కోసం ఉపయోగించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఇదే భూమిలో ఈ నెల 9న గుండ్లసాగరానికి చెందిన ఆర్ముగం భవనం నిర్మించడానికి పూనుకొన్నారు. గ్రామస్థులు గుర్తించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు చేరుకుని పోలీసుల సహాయంతో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈనేపథ్యంలో ఆదివారం వడ్డెవానికుంట భూమిలో గుండ్లసాగరానికి చెందిన రాజేంద్ర, ఆర్ముగం, గోవిందప్పలు కొబ్బరి చెట్లు నాటుతున్నట్లు గ్రామస్థులు తెలుసుకొన్నారు. ఈ విషయాన్ని డీటీ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీఆర్వోలు కుమార్, జస్వంత్, వీఆర్ఏ నాగేంద్ర వెంటనే వడ్డెవానిగుట్టకు చేరుకున్నారు. గ్రామస్థులు కూడా చేరుకున్నారు. అక్కడి భూమిలో కొబ్బరి మొక్కలు నాటుతున్న రాజేంద్ర, ఆర్ముగం, గోవిందప్పలను వీఆర్వోలు ప్రశ్నించారు. దీంతో వారు ఆగ్రహోదగ్రులయ్యారు. రెవెన్యూ సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషించారు. ఆ తరువాత గుండ్లసాగరం వీఆర్వో కుమార్‌పై ఆక్రమణదారులు దాడి చేశారు. దాడిలో గాయపడిన వీఆర్వో కుమార్‌ను గ్రామస్థులు కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి సంఘటనపై రెవెన్యూ సిబ్బంది గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

ఎంపీపీ సవాల్ మేరకు రూ.25 కోట్ల ఆస్తి ప్రజలకు రాసివ్వండి

లేకుంటే పదవికి రాజీనామా చేయాలి ● టీడీపీ నేతల డిమాండు
● వాయిదా పడిన వి.కోట మండల సమావేశం


మండల కార్యాలయంలోకి వెళుతున్న టీడీపీ శ్రేణులు - టీడీపీ నేతలతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట, ఆగస్టు 11: వైసీపీ అధికారంలో ఉండగా చేసిన సవాలు మేరకు ఎంపీపీ యువరాజ్ తన రూ.25 కోట్ల ఆస్తిని ప్రజలకు రాసివ్వాలన్న టీడీపీ నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు వీరు మండల పరిషత్ కార్యాలయంలోని రావడంతో సమావేశం వాయిదా పడింది. ఆదివారం వి.కోట మండల సర్వసభ్య సమావేశం ఉండటంతో ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం మొదలవుతుందని అందరూ బావించారు. అనూహ్యంగా మండల పరిధిలోని టీడీపీ సర్పంచులు, ఇతర మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఆయన గతంలో కుంబార్లపల్లె పంచాయతీలో ఒక్క ఓటు మెజారిటీ వచ్చినా తన రూ.25 కోట్ల ఆస్తి రాసిస్తామన్న సవాల్‌ను వీరు గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీకి ఆ పంచాయతీలో తిరుగులేని మెజారిటీ రావడంతో గతంలోనే ఓసారి ఇదే డిమాండుతో కార్యాలయాన్ని ముట్టడించారు. అప్పట్లో ఎంపీపీ లేకపోవడంతో వెనుదిరిగారు. అప్పటి వాగ్దానానికి కట్టుబడి ఆస్తి రాసివ్వాలని, లేకుంటే ఎంపీపీ పదవికి రాజీనామా చేయాలంటూ ఆదివారం కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు టీడీపీ నేతలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీనికి వారు పట్టించుకోలేదు. చివరగా జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఇరు పక్షాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అందుకు ఇరుపక్షాలు అంగీకరించక పోవడంతో కార్యాలయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎట్టకేలకు పోలీసుల సహకారంతో ఎంపీపీ యువరాజ్ కార్యాలయం నుంచి బయటకు వచ్చేశారు. సమావేశం వాయిదా పడటంతో ఎంపీటీసీలు, అధికారులు అందరూ వెనుదిరిగారు. ఎంపీపీ సవాల్‌ను పలువురు గుర్తుచేసుకుంటూ.. రాజకీయాల్లో ఎప్పుడు, ఏం జరుగుతుందో ఎవరూ ఊహించరని, ఎదుటి వారిపై మాట్లాడేప్పుడు సంయమనం వహించాలని పేర్కొన్నారు.

రమేష్ చంద్రప్రసాద్‌కు పలువురి నివాళి


రమేష్ చంద్ర ప్రసాద్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితర నేతలు

నిండ్ర, ఆగస్టు 11: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్‌కు పలువురు నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన నిండ్ర మండలం ఉరూరుపేటలో ఆదివారం కర్మక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. టీడీపీకి రమేష్‌చంద్ర ప్రసాద్ చేసిన సేవలను పలువురు ఎమ్మెల్యేలు, నేతలు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయనకు పుష్పాంజలి ఘటించిన వారిలో మాజీ మంత్రి కరణం బలరాం, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, జయచంద్రనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, నేతలు ఎస్సీవినాయుడు, నేతలు చంద్రప్రకాష్, అశోక్ రాజు, ఆర్సీ మునికృష్ణ, ఎంఎం రాధాకృష్ణ, చినబాబు, ప్రకాష్‌నాయుడు, పాకారాజా, వెంకటేశ్వరరావు, ధనంజయనాయుడు, దశరధవాసు, గాలి రమేష్‌నాయుడు, డిల్లీబాబు, గంగాధరం నాయుడు, ధనంజయయాదవ్, ధనంజయనాయుడు, లక్ష్మీపతిరాజు, గిరి, మురళీనాయుడు, రవికుమార్, గిరిబాబు, శివక్రిష్ణమనాయుడు, పీఎన్. రాధాకృష్ణ, గజేంద్ర నాయుడు, చంద్ర, రమేష్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

19న శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

రేపు షార్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక



తడ, ఆగస్టు 11: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెలలో జిల్లాలో విడివిడిగా పర్యటించనున్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో మంగళవారం జరగనున్న అంతరిక్ష దినోత్సవాల్లో పాల్గొనడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రానున్నారు. తిరుపతి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చి అక్కడినుంచి హెలికాప్టర్‌లో శ్రీహరికోటకు చేరుకుంటారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకుంటారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 19వ తేదీన శ్రీసిటీకి రానున్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానం మేరకు ఆయన సెజ్‌లో పర్యటించేందుకు సమ్మతించారు. ఆ రోజంతా ఆయన శ్రీసిటీలోనే ఉండనున్నట్లుగా సమాచారం. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు రానుండటంతో అధికారులు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీరి పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం అందిందని.. ఏర్పాట్లు చేస్తున్నామని సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో క్వారీ వద్ద కూలీ మృతి


మృతిచెందిన చిన్నస్వామి

పలమనేరు, ఆగస్టు 11: పలమనేరు మండలం కొలమాసనపల్లి సమీపంలోని క్వారీ వద్ద ఆదివారం చిన్నస్వామి అనే కూలీ మృతి చెందారు. ఇతడి మృతిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. తమిళనాడుకు చెందిన ఈయన కొంతకాలంగా ఎర్రగుండేపల్లిలోని అన్నా వదినల వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం క్వారీ వద్దకు వెళ్లిన చిన్నస్వామిని అపస్మారకస్థితిలో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈయన క్వారీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జేసీబీ బకెట్ వీపుపై పడటంతో ఆస్పత్రికి తీసుకొచ్చారని కొందరు చెబుతున్నారు. ఇక్కడి వైసీపీ నాయకులు మాత్రం విలేకరుల సమావేశం నిర్వహించి జీతం డబ్బులు అడిగాడని క్వారీ నిర్వాహకులు కొట్టడంతో చిన్నస్వామి చనిపోయాడని ఆరోపిస్తున్నారు. విషయం బయటకు పొక్కకుండా క్వారీ నిర్వాహకులు చిన్నస్వామికి చెందిన వారికి రూ.లక్ష ఇచ్చారని తెలిసిందన్నారు. దీనిపై పోలీసులు విచారణ జరిపించాలని కోరారు. అక్రమ మైనింగ్‌లో చిన్నస్వామి మృతి చెందినందున ఆయన కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. దీనిపై డీఎస్పీ విష్ణు రఘువీర్‌ను విలేకరులు వివరణ కోరగా.. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. పోస్టుమార్టం రిపోర్టులో చిన్నస్వామి మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు. జీతాల కోసం కొట్టి చంపారన్న వైసీపీ నాయకుల ఆరోపణ నమ్మశక్యంగా లేదన్నారు. రాజకీయ లబ్ధికి నాయకులు ఆరోపణలు చేయడం సహజమన్నారు. కాగా, పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నస్వామి మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్టు



చిత్తూరు, ఆగస్టు 11: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒకటో పట్టణ సీఐ జయరామయ్యతో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. చిత్తూరు-బండపల్లె రోడ్డులో మిట్టూరుకు చెందిన మదన్(26), మనోజ్(23)లు సైకిళ్లపై గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా మదన్ వద్ద రెండు కిలోలు, మనోజ్ వద్ద కిలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. రూ. 75వేల విలువ చేసే మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సుమన్, సిబ్బంది సురేష్, జనార్దన్, సుధాకర్, సుదర్శన్, సుల్తాన్‌లను డీఎస్పీ అభినందించారు.

వీఆర్వోల ప్రైవేట్ గదుల్లో రికార్డులు

వాటి భద్రతపై అనుమానాలు - రేణిగుంట విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల రూటే సపరేటు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండల పరిధిలోని వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్)ల వ్యవహారశైలిపై విమర్శలు వస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం కాదని సొంతంగా అద్దె గదులను తీసుకుని ఎక్కువ సమయం అక్కడే ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక వారి పంచాయతీకి సంబంధించిన రెవెన్యూ రికార్డులను అక్కడే ఉంచుకున్నట్టు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకు ఖాళీగా ఉన్న రెవెన్యూ, వివాదాస్పద భూముల పత్రాలను చూపించి వారి కబ్జాకు సహకరించారన్న ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ప్రైవేట్ గదులను వదిలిపెట్టడంలేదని తెలుస్తోంది. సోమవారం మాత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయంలో ఓ గంటపాటు ఉండి తక్కిన సమయం ఆ గదుల్లోనే ఉంటూ సేద తీరుతుంటారని సమాచారం. వారి కోసం ఎవరొచ్చినా తహసీల్దార్ కార్యాలయం కాకుండా సొంత కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. తొలుత అక్కడ 'సెటిల్' చేసుకుంటేనే తహసీల్దార్ కార్యాలయం వరకు ఫైలు కదులుతుందన్న ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇవి అటుంచితే రెవెన్యూ రికార్డుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ గదుల్లో ఎక్కడపడితే అక్కడ రికార్డులు, పత్రాలు పడి ఉన్నాయి. ముఖ్యమైన రికార్డులు కనిపించకపోయినా, ఎవరైనా అపహరించినా బాధ్యత ఎవరిదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


రేణిగుంటలోని వీఆర్వోల ప్రైవేట్ కార్యాలయంలో ఉన్న రికార్డులు

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళం



సోమల, ఆగస్టు 11: పట్టణంలో కొలువుదీరిన స్వయంబేశ్వరస్వామి ఆలయం ఆవరణలో నిర్మిస్తున్న శివపార్వతుల కల్యాణ మండపానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. సోమలకు చెందిన పచ్చిపులుసు మంజునాథ్ సోమవారం రూ.10,116 విరాళాన్ని ఆలయ ధర్మకర్త సోమశేఖర్‌కు అందజేశారు. మాజీ వైస్‌ఎంపీపీ లలిత, వాసుదేవకుమార్ రూ. 50వేలు అందజేశారు. వరదం చెన్నరాయప్పతో కలసి ఆయన సోదరుడు కృష్ణప్ప రూ.4లక్షల వ్యయంతో కాంక్రీట్, ఐరన్ సీట్లు సమకూర్చారు. కార్యక్రమంలో పీ. లింగయ్య, చెన్నరాయప్ప పాల్గొన్నారు.

నెల్లిమంద పాలేటమ్మ జాతర వేడుకలు



సోమల, ఆగస్టు 11: నెల్లిమంద పాలేటమ్మ ఆలయంలో జాతర వేడుకల్లో భాగంగా ఆదివారం అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణలు జరిపి అభిషేక పూజలు జరిపారు. పలు గ్రామాల నుంచి పుష్ప పల్లకీ బండ్లు ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొన్నాయి. రాత్రి అమ్మవారికి బోనాలు, పిండి దీపాలతో ఊరేగింపుగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎగువపల్లెలో పొలిమేర అమ్మవార్లకు బోనాలు, పిండిదీపాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ శివశంకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్మకర్త సాకిబండ నరసింహులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అభయాంజనేయుడికి ఆకు పూజ



సదుం, ఆగస్టు 11: తాటిగుంటపాళెంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజాభిషేకాలు నిర్వహించారు. 101 బిందెల నీళ్లతో శుభ్రపరిచి ఫల, పుష్ప, సుగంధ ద్రవ్యాలతో స్వామి వారికి ప్రీతిపాత్రమైన తమలపాకులతో సుందరంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానికులు గోవింద శెట్టి, మేనక, రంజిత్ కుమార్ కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట విత్తనాలు అందక ఇబ్బందులు

సోమల, ఆగస్టు 11: పచ్చి రొట్ట విత్తనాలు లేక రైతులు నిరాశ చెందుతున్నారు. జూలైలో జీలుగలు, జనుము విత్తనాలు పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ పది శాతం కూడా మండలానికి మంజూరు చేయలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు వినియోగించాలని అధికారులు ప్రకటనలు చేస్తున్నా సకాలంలో అందించడంలేదని వీరు వాపోతున్నారు. మామిడి కోతలు పూర్తి చేసి తోటల్లో దుక్కులు చేసి జీలుగ, జనుము విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

10మంది కంటి ఆపరేషన్‌కు ఎంపిక

పుంగనూరు రూరల్, ఆగస్టు 11: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్‌కు 10మంది ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్టు ప్రతినిధి డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ హాస్పిటల్ వైద్యులు 70మందికి పరీక్షలు నిర్వహించారు. 10మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రెండవ ఆదివారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు.. కంటి పరీక్షలకు వచ్చిన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ రెడ్డికార్తీక్, వరదారెడ్డి, త్రిమూర్తి రెడ్డి, సురేశ్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, రెడ్డిప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉదయ్‌కుమార్, టీడీపీ నేతలు

శాంతిపురం, ఆగస్టు 11: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్ అన్నారు. రెండు రోజులుగా గుండుశెట్టిపల్లె వద్ద షార్ట్ పిచ్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతోంది. ఆదివారం టోర్నమెంటులో సుమారు 50 జట్లు తలపడ్డాయి. విజేతలుగా నిలిచిన సొన్నెగానిపల్లె జట్టుకు రూ. 50 వేల నగదు, ట్రోఫీలను డా. సురేశ్‌కుమార్, అనసూయలు , ద్వితీయ స్థానంలో నిలిచిన కర్నాటక జట్టుకు రూ.25 వేలు నగదు, ట్రోఫీలను మాజీ ఎంపీపీ ఉదయ్‌కుమార్, విజయరామిరెడ్డిలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవి, రాజేంద్ర, అరుళ్, భాస్కర్‌తో పాటు టీడీపీ నేతలు నాగభూషణం, చంద్రశేఖర్, ఉయ్యాల జయరామిరెడ్డి, ఉమాపతి, వేదశ్రీ, బాలు, నాగరాజు, ఇతర గ్రామస్థులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు

పుంగనూరు, ఆగస్టు11: కూటమి పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. చదళ్లకు చెందిన ఎస్వీఆర్‌ట్రస్ట్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలల్లోనే ఎన్నికల హామీలను నేరవేర్చడానికి చర్యలు చేట్టినట్లు తెలిపారు. పాలనను గాడిలో పెట్టడానికే సీఎం చంద్రబాబు సమయం సరిపోతోందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి బాటలో నడిపిస్తారని అయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సీవీరెడ్డి, పోలీసు గిరి, రెడ్డెప్పనాయుడు, మణి, జనసేనా నాయకులు పగడల రమణ, విరూపాక్షి, హరినాయక్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు మండల కమిటీ ఏర్పాటు



ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

చౌడేపల్లె, ఆగస్టు11: మాల మహానాడు మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యమల సుదర్శన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక శ్రీనివాస కల్యాణ మండపలంలో నూతన కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుంగనూరు ఇన్‌చార్జిగా కృపామణి, మండల ఆధ్యక్షుడిగా కొత్తపల్లె మణి, గౌరవ అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా విజయ్, ఉపాధ్యక్షుడిగా రెడ్డిప్రసాద్, ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా సురేష్, రాము, ప్రచార కార్యదర్శులుగా వెంకటరమణ, రాజశేఖర్, కమిటి సభ్యులుగా పరికిదోన చంగలాయలుతో పాటు మరో 22 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు అధికార ప్రతినిధి మల్లిల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



చెక్కు అందజేస్తున్న చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, ఆగస్టు 11: చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్ పేటలో మసీదు నిర్మాణానికి టీడీపీ నేత చంద్రప్రకాష్ రూ.50 విరాళం ప్రకటించారు. నగరంలోని చంద్రపక్రాష్ నివాసంలో ఆదివారం బీఎన్ఆర్ పేటకు చెందిన టీడీపీ మైనారిటీ నాయకులు ఆయన్ను కలిసి సన్మానించారు. అనంతరం ఆయన చెక్కును వారికి అందజేశారు. వైఎస్సార్ కాలనీలోని ఈద్గా మసీదు నిర్మాణానికి రూ.10 వేల చెక్కును అందజేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కరాటే పోటీల్లో రామకుప్పం విద్యార్థి సిద్ధార్థ ప్రతిభ



రామకుప్పం, ఆగస్టు 11: తిరువణ్ణామలైలో జరిగిన కరాటే పోటీల్లో చెల్దిగానిపల్లె పంచాయతీ బూరుగుమాకుల పల్లెకు చెందిన విద్యార్థి సిద్ధార్థ విశేష ప్రతిభ కనబరిచాడు. వి.కోట కృష్ణారెడ్డి చైతన్య స్కూల్ విద్యార్థి సిద్ధార్థ పోటీల్లో పాల్గొని రెండో బహుమతి పొందినట్టు విద్యార్థి తండ్రి రామచంద్ర తెలిపారు.

సీఐగా సోమశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



వి.కోట, ఆగస్టు 11: అర్బన్ సీఐగా సోమశేఖర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ లింగప్ప చిత్తూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సోమశేఖర్‌రెడ్డి కర్నూల్ నుండి బదిలీపై వచ్చారు. బదిలీపై వెళ్ళుతున్న లింగప్పను స్థానిక టీడీపీ, వైసీపీ నేతలు సన్మానించారు. సహచర పోలీసు సిబ్బంది శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై బాబు, ఏఎస్సైలు జయకృష్ణా, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదా దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పలమనేరు, ఆగస్టు11 : టి.ఒడ్డూరులో ఆదివారం భూ తగాదాల నేపథ్యంలో ఆదివారం జరిగిన ప్రత్యర్థుల దాడిలో బి.బాబు(33), సోమశేఖర్(42), లక్ష్మమ్మ(35), మహదేవ(45), మహాలక్ష్మి(50)లు గాయపడ్డారు. వీరు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భూ తగాదా కారణంగా తమపై టి.ఒడ్డూరు గ్రామానికి చెందిన దొరస్వామి, జ్యోతమ్మ, అమర, వినోద్, అమృత, అనూష, బాబు, దేవరాజులు రాళ్లతో దాడికి పాల్పడ్డారని బాధితులు పేర్కొన్నారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపి

చౌడేపల్లె, ఆగస్టు11: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుని కథనం మేరకు..కలికిరికి చెందిన గోపి ద్విచక్రవాహనంలో చౌడేపల్లె వస్తున్నాడు. ఈక్రమంలో చౌడేపల్లె వైపు నుంచి మరో ద్విచక్రవాహం సోమల వైపు వెలుతోంది. సింగిరి గుంట సమీపంలో ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో గోపికి కాలుకు తీవ్ర గాయమైంది. మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చౌడేపల్లె ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి బదిలీ

చౌడేపల్లె, ఆగస్టు11: స్థానిక ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కడప జిల్లాకు బదిలీ ఆయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ...ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినందుకు అవార్డు అందుకున్నామన్నారు. ఎన్నికల ఆనంతరం సాధారణ బదలిలో భాగంగా కడప జిల్లా కమలపురానికి తనను బదిలీ చేశారన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన చంద్రమ్మ

తవణంపల్లె, ఆగస్టు 11: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శాంతికుమారి కథనం మేరకు.. ఐరాల మండలం రెడ్డివారిపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి, భార్య చంద్రమ్మ(48) యాదమరి మండలం చిత్తపార నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతున్నారు. తవణంపల్లె మండలం కాణిపాకపట్నం ఫైవోవర్ సమీపంలో సర్వీసు రోడ్డు నుంచి హైవేకు వెళుతున్న లారీ తగిలి చంద్రమ్మ రోడ్డుపై పడింది. ఆమెపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆదివారం ఆరోగ్య సేవలు అంతంతమాత్రం

- పేరుకే 24 గంటల ఆసుపత్రి
- డీఎంహెచ్‌వో ఆదేశాలు బేఖాతరు



డాక్టరు లేక ఖాళీగా దర్శనం ఇస్తున్న డాక్టర్ సీటు

చౌడేపల్లె, ఆగస్టు11: అంటువ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్న నేపథ్యంలో కచ్చితంగా ఆదివారం కూడా డాక్టర్లు మధ్యాహ్నం వరకూ అందుబాటులో ఉండాలనే డీఎంహెచ్‌వో ఆదేశాలను చౌడేపల్లె ప్రభుత్వాసుపత్రిలో బేఖాతరు చేస్తున్నారు. మండల కేంద్రంలో పేరుకే 24 గంటల ఆసుపత్రిగా ఉంది. సాయంత్రం 4 గంటలకు ముందే డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. ఇద్దరు డాక్టర్లు ఉన్నా శనివారం మధ్యాహ్నం 3 గంటలకే అందుబాటులో లేరు. కేవలం ఫార్మసిస్ట్ , స్టాఫ్‌నర్స్ మాత్రమే రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. కొంతకాలంగా సీజనల్, అంటు వ్యాధుల కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఈనేపథ్యంలోనే మూడు రోజుల క్రితం డీఎంహెచ్‌వో ప్రభావతి ఈ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం వరకు కచ్చితంగా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఈసందర్భంగా ఆమె ఆదేశించారు. రెండు రోజులు తిరగకమునుపే స్థానిక డాక్టర్లు ఆమె ఆదేశాలను తుంగలో తొక్కారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలైనా డాక్టర్లు ఒక్కరూ అందుబాటులో లేరు. స్టాఫ్‌నర్స్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. మరుగుదొడ్లకు డాక్టర్ తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యంతో మెడికల్ లీవులు కావాలన్నా డాక్టర్ మంజూరు చేయడం లేదని కొందరు సిబ్బంది ఆరోపిస్తున్నారు. జ్వరాలు ప్రబలుతుంటే ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లున్నా ఉపయోగం ఉండటంలేదని రోగులు ఆవేదన చెందుతున్నారు.

ముగిసిన అంతర జిల్లాల షూటింగ్ బాల్ పోటీలు



విజేతగా నిలిచిన జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

వి.కోట, ఆగస్టు 11: రెండు రోజులుగా వి.కోటలో జరిగిన అంతర జిల్లాల షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. 16 జిల్లాల నుంచి క్రీడాకారులు సబ్ జూనియర్ విభాగం బాల, బాలికల పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, పల్నాడు జిల్లా ద్వితీయ స్థానంలో, అన్నమయ్య జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో, అన్నమయ్య జిల్లా ద్వితీయ స్థానంలో, చిత్తూరు జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లుకు లయన్స్ క్లబ్(వి.కోట) బహుమతులు అందజేసింది. కార్యక్రమంలో రాష్ట్ర షూటింగ్ బాల్ కార్యదర్శి పరశురాముడు, చిత్తూరు చైర్మన్ మహేష్, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, అధ్యక్షులు పవన్, కార్యదర్శి వేణుగోపాల్, లోకనాథం, జాబీర్, స్వాతి, సురేష్, శ్రీలత, సుధాకర్, జమున తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

రామకుప్పం, ఆగస్టు 11: వి.కోటలో ఈనెల 10,11 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. జట్టులోని రామకుప్పం అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థులు రామ్‌చరణ్‌నాయక్, అజిత్‌నాయక్, అమరనాథరెడ్డి, శేషాద్రి, చరణ్, దినేష్‌ల విశేష ప్రతిభ కనబరిచారని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. విద్యార్థులను, షూటింగ్‌బాల్ జట్టు కోచ్ జాబిర్, పీడీ ప్రతాప్‌లను ఆయన అభినందించారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



టీడీపీ పతాకావిష్కరణలో ఆనందరెడ్డి తదితరులు

రామకుప్పం, ఆగస్టు 11: రాష్ట్రంలో గ్రామాల సర్వతోముఖాభివద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, జనసేన, బీజేపీ మండల అధ్యక్షుడు హరీష్, వెంకటేశ్‌లు అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తొలగించిన పార్టీ పతాకాలను ఆదివారం నేతలు పలు గ్రామాల్లో తిరిగి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి జరగకపోగా, అరాచకం, దౌర్జన్యాలు, వేధింపులు రాజ్యమేలాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తుంటే వైసీపీ పెద్దలు రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ పరిశ్రమలు రాకుండా అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో నాయకులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, సీతాపతి, రామకృష్ణప్ప, సలాంసాబ్, జయశంకర్, మనోహర్, నందారెడ్డి, వెంకటరమణ, గంట్లరెడ్డి, గజేంద్ర, సత్తి, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతికి జ్ఞాపిక బహూకరణ



వెంకయ్యనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న తులసినాథం నాయుడు

పలమనేరు, ఆగస్టు11 : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి. తులసినాథంనాయుడు, పుష్ప దంపతులు తెలుగుతల్లి జ్ఞాపికను అందజేసి, శాలువకప్పి శుభాకాంక్షలు తెలిపారు. 75వ జన్మదినం సందర్భంగా ఆయనను విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ద్వారా తెలుగు భాషా సంస్కృతులకు వీరు చేస్తున్న సేవలను వెంకయ్యనాయుడుకు అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ వివరించారు. వెంకయ్యనాయుడు వీరిని అభినందించారు. మురళి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో టీడీపీ బలోపేతానికి కృషి



కార్యకర్తలతో మాట్లాడుతున్న పురుషోత్తమరాజు

చౌడేపల్లె, ఆగస్టు11: కలసికట్టుగా టీడీపీ బలోపేతానికి కృషి చేద్దామని పారిశ్రామికవేత్త టీడీపీ నాయకులు ఏకొత్తకోట క్లస్టర్ ఇన్‌చార్జి పురుషోత్తమరాజు అన్నారు. ఆదివారం ఆయన ఏ కొత్తకోటలో టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుని ఏకొత్తకోటను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మునిరాజు, కిరణ్, నాగరాజు, మల్లికార్జున, కుమార్, మురళి తదితులు పాల్గొన్నారు.

తప్పుడు రాతలు రాస్తారా?

- జగన్ పత్రికపై టీడీపీ నేతల ఫిర్యాదు.. ప్రతుల దహనం



సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ శ్రేణులు

కుప్పం, ఆగస్టు 11: జగన్ పత్రికలో తప్పుడు రాతలు రాస్తున్నారంటూ టీడీపీ శ్రేణులు మండిపడ్డాయి. కుప్పంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు, పత్రిక ప్రతులను దహనం చేశాయి. సీఎం చంద్రబాబును కించపరుస్తూ జగన్ పత్రికలో ఆదివారం తప్పుడు కథనాలు వచ్చాయంటూ టీడీపీ శ్రేణులు సాయంత్రం ఊరేగింపుగా అర్బన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. నిరాధారమైన కథనాలు ప్రచురిస్తున్న జగన్ పత్రికపైనా, యాజమాన్యంపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అర్బన్ సీఐ జీటీ నాయుడుకు ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్ ఎదుట పత్రిక ప్రతులను దహనం చేశారు. మరోసారి తప్పుడు కథనాలు ప్రచురిస్తే కుప్పంలోకి రాకుండా జగన్ పత్రికను అడ్డుకుంటామని ప్రకటించారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తోపాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



చౌడేపల్లె, ఆగస్టు11: పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేశారు. స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచియే కాకుంబా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గంగమ్మ అమ్మవారి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాఠశాలకు మురుగు వెతలు

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



పాఠశాల ఆవరణలో మురుగు నీటి కాలువ

శాంతిపురం, ఆగస్టు 11 : అనెకర పంచాయతీ చంద్రగిరి క్రాస్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాల ప్రహరి గోడ ప్రధాన ద్వారం వద్ద మురుగు నీటి దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్కూలులో సుమారు 125 మంది విద్యార్థులు చదువుతున్నారు. 20 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. చంద్రగిరి కాలనీలో కాలవ ద్వారా మురుగు నీరు పాఠశాల ప్రహరీ ప్రధాన ద్వారం వరకు ప్రవహిస్తోంది. కాలువ నిర్మాణం అక్కడితో ఆపేయడంవల్ల మురుగు నీరు పాఠశాల ఆవరణలోకి వస్తోంది. మురుగు నీటి దుర్వాసనతో మధ్యాహ్న భోజనం తినడానికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాల ప్రధాన ద్వారం అవతలి వరకు డ్రైనేజీ కాలువ నిర్మిస్తే ఈ ఇబ్బంది తప్పుతుందని స్కూలు వర్గాలు చెబుతున్నాయి.స్థానిక సర్పంచ్‌కు, కార్యదర్శిలక్కు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు పాఠశాల ఆవరణలోకి వరద నీరు చేరుతోంది. ఆవరణలోని గుంతలను మట్టితో పూడ్చి వరద నీటికి అడ్డుకట్ల వేయాలని కోరుతున్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 11: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు నంద్యాలకు చెందిన మనోహర్‌రెడ్డి రూ.1,00,116 ఆదివారం విరాళంగా అందించారు. దాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 11: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు నంద్యాలకు చెందిన మనోహర్‌రెడ్డి రూ. 1,00,116 ఆదివారం విరాళంగా అందించారు. దాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

నైపుణ్యం పెంపుతో స్వయం ఉపాధి



శిక్షణ తీసుకుంటున్న వారితో ఉదయశంకర్

విజయపురం, ఆగస్టు 11: సొంత ప్రాంతంలో స్వయం ఉపాధి పొందాలంటే నైపుణ్యం, శిక్షణ అవసరమని చెన్నైకి చెందిన స్కిల్ డెవలప్‌మెంట్ నిష్ణాతులు ఉదయశంకర్ పేర్కొన్నారు. చెన్నైలోని ఒక ప్రైవేటు ఆస్పత్రి అడ్మిన్ శ్రీధర్‌బాబు నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని గంగమాంబాపురంలో ఆదివారం యువతకు, మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఉదయశంకర్ మాట్లాడుతూ పరిసరాలలో అందుబాటులో ఉండే ముడి సరుకు, వనరులను గుర్తించి వాటి ద్వారా ఆర్థికాభివృద్ధి చెందడానికి అనుగుణంగా స్కిల్ పెంచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి కోసం అమలు చేస్తున్న స్కీములను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉండే రంగాల్లో దిగితే త్వరగా అభివృద్ధి సాధించవచ్చు నని తెలిపారు. కార్యక్రమంలో వీసీ సౌందర్‌రాజన్, టీడీపీ నాయకులు బాలాజీనాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ఆడి తిరునాళ్ల

విజయపురం, ఆగస్టు 11: తమిళ ఆడినెల నాలుగో ఆదివారం గ్రామాల్లో ఆడి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. జీఎంపురంలో గ్రామదేవతకు భక్తులు అంబలి పోసి మొక్కు తీర్చుకున్నారు. విజయపురం, కోసలనగరం ఎస్టీకాలనీలో పెద్ద పాళెమ్మకు పొంగళ్లు పెట్టి భక్తులు మొక్కు తీర్చుకున్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



సమావేశంలో బీజేపీ నాయకులు

నగరి, ఆగస్టు 11: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీన ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగిరేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. నగరి బీజేపీ కార్యాలయంలో ఆదివారం వారు సమావే శమయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి మున్సిపాలిటీ పరిధిలో ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సౌందర్యపాడి, నాయకులు పొన్నప్పన్, శ్రీనివాసన్, మణివణ్ణన్, రాము, విశ్వం అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

చదరంగం మేధస్సును పెంచుతుంది

నగరి, ఆగస్టు 11 : చదరంగం మేధస్సును పెంచుతుందని డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు పేర్కొన్నారు. నగరి మండలం వీకేఆర్‌పురంలోని గ్రాండ్ వరల్డ్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ వారు నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ విభాగంలో హేమాద్రి(బూచివానత్తం, విజయపురం మండలం), జలీల్ (నగరి), శ్యామ్‌కుమార్(శ్రీకాళహస్తి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు. జూనియర్స్ 9వ విభాగంలో తిరుపతికి చెందిన అద్విక్, వెంకటహర్షిత్, అర్నా, 7వ విభాగంలో కుషాల్‌కుమార్, కార్తికేయన్, వినోద్‌కుమార్ మొదటి మూడు స్థానాలు సాధించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజరాజేశ్వరి, కార్యదర్శి డాక్టర్ మంజుల, ట్రెజరర్ పుష్పలత, మోహన్, నవీన్‌కుమార్, ఖలీల్‌బాషా పాల్గొన్నారు.

గుడి నిర్మాణంపై విచారణ చేపట్టాలి

శ్రీరంగరాజపురం, ఆగస్టు 11: ఆరిమాని గంగమ్మ గుడి నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై విచారణ చేపట్టాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు హిమాచలపతిరెడ్డి కోరారు. ఆదివారం గంగమ్మగుడిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గుడి నిర్మించాలని నిర్ణయించినా ఇప్పటివరకు పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. హుండీ చోరీ కేసులో ఆయన హస్తముందని, విరాళాల వినియోగంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం నాయుడు, దామోదర్ నాయుడు, బాలకృష్ణారెడ్డి, జీవన్‌రెడ్డి, లింగారెడ్డి, రఘునాయుడు, చందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన చంద్రమ్మ

తవణంపల్లె, ఆగస్టు 11: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శాంతి కుమారి కథనం మేరకు.. ఐరాల మండలం రెడ్డివారిపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి, భార్య చంద్రమ్మ(48) యాదమరి మండలం చిత్తపార నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళుతున్నారు. తవణంపల్లె మండలం కాణిపాకపట్నం ఫ్లైవోవర్ సమీపంలో సర్వీసు రోడ్డు నుంచి హైవేకు వెళుతున్న లారీ తగిలి చంద్రమ్మ రోడ్డుపై పడింది. ఆమెపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నేడు చిత్తూరులో హర్ ఘర్ తిరంగా

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 8 : ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా బీజేపీ శ్రేణులు సోమవారం నగరంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టనున్నారు. జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. గాంధీ సర్కిల్ నుంచి పొన్నియమ్మన్ గుడివీధి, చర్చి, రాములవారి గుడి, బజారు వీధుల మీదుగా హైరోడ్డు నుంచి జ్యోతిరావు పూలే విగ్రహం వరకు ర్యాలీ సాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నామినేటెడ్ పోస్టు కేటాయించండి



షరీఫ్‌తో నియాజ్‌అలీ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 11: పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా సేవ చేస్తున్నానని, నామినేటెడ్ పదవి కేటాయించాలని టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, తూగుండ్రం పంచాయతీ మాజీ సర్పంచ్ నియాజ్‌అలీ కోరారు. ఈ మేరకు అమరావతిలో శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును కలిసి బయోడేటాలు అందజేశారు.

దేవతామూర్తుల ఊరేగింపు



నింద్ర, ఆగస్టు 11: నింద్ర ద్రౌపదీ ధర్మరాజుల ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం దేవతామూర్తులను విశేషంగా అలంకరించి, పురవీధులలో ఊరేగించారు. భక్తులు హారతులు ఇచ్చి మొక్కులు తీర్చు కున్నారు.

వెస్ట్ సీఐ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఆగస్టు 11: వెస్ట్ సీఐగా శ్రీధర్ నాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సీఐగా ఉన్న రవిశంకర్ రెడ్డిని వీఆర్‌కు తీసుకోగా ఆయన స్థానంలో కడప జిల్లా సైబర్‌క్రైమ్ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై శ్రీధర్ నాయుడు ఇక్కడికి వచ్చారు. ఆదివారం బాధ్యతలు తీసుకుని మర్యాదపూర్వకంగా పై అధికారులను కలిశారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి

శ్రీరంగరాజపురం, ఆగస్టు 11: ప్రధాని మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని సీఎస్సీ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మసీదు నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



చెక్కు అందజేస్తున్న చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, ఆగస్టు 11: చిత్తూరు రూరల్ మండలం బీఎస్ఆర్ పేటలో మసీదు నిర్మాణానికి టీడీపీ నేత చంద్రప్రకాష్ రూ.50 విరాళం ప్రకటించారు. నగరంలోని చంద్రపక్రాష్ నివాసంలో ఆదివారం బీఎస్ఆర్ పేటకు చెందిన టీడీపీ మైనారిటీ నాయకులు ఆయన్ను కలిసి సన్మానించారు. అనంతరం ఆయన చెక్కును వారికి అందజేశారు. అలాగే వైఎస్సార్ కాలనీలోని ఈద్గా మసీదు నిర్మాణానికి రూ.10 వేల చెక్కును అందజేశారు. నాయకులు నయాజ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

అంకాల పరమేశ్వరికి పాలాభిషేకం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 11: స్థానిక గుర్రప్పనాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరికి ఆడిమాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తులు పాలాభిషేకం చేశారు. కట్టమంచి సంపద వినాయక ఆలయం నుంచి 108 మంది భక్తులు పాలబిందెలను మేళతాళలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు కేఎం కుమార్, వేళాయుధం, వేలుస్వామి, ధనకోటి, ముత్తు, వేలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 11: నగరంలోని 75 దొడ్డిపల్లె పచ్చయమ్మన్ ఆలయంలో సోమవారం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.ఎస్.తిరుకుమరన్ తెలిపారు. అమ్మవారికి అభిషేకం, గోపూజల అనంతరం స్వామి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు.

వైభవంగా సప్తకన్నికలమ్మకు పూజలు



గుడిపాల, ఆగస్టు 11: మండలంలోని బసవాపల్లి పంచాయతీ రెట్టగుంట గ్రామంలో ఆదివారం సప్తకన్నికలమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అన్నదానం చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం



బోరును ప్రారంభిస్తున్న హేమాద్రి నాయుడు

గుడిపాల, ఆగస్టు 11: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రాధాన్యమిస్తున్నారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి, రామభద్రాపురం సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడు అన్నారు. మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం బోరు మంజూరు చేయించారని తెలిపారు. రామభద్రాపురం గ్రామంలో ఆదివారం బోరు వేయించారని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ పళని, బీసీ నాయకుడు మోహన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నింద్ర, ఆగస్టు 11: పుత్తూరు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని శ్రీరామపురం పంచాయతీ సదాశివపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు అధ్యక్షుడు కోనేటి రవిరాజు తెలిపారు. సర్పంచ్ జయమ్మ ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో తిరుపతికి చెందిన మాధురి రెమిడ్ హాస్పిటల్, వాసన్ ఐకేర్ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు కుమార్, హరిదీప్, ప్రవళిక, వనజ పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా పాలసముద్రం

● అంతంతమాత్రంగానే రవాణా సౌకర్యం ● ఉపాధి కోసం పక్కనున్న తమిళనాడుకు వెళ్లాల్సిన పరిస్థితి



పాలసముద్రం, ఆగస్టు 11: జిల్లా కేంద్రం చిత్తూరుకు 40 కి.మీ దూరంలో ఉన్న పాలసముద్రం మండలం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. తమిళనాడు సరిహద్దులో గల ఈ మండలంలో 13 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఎక్కువ పంచాయతీలకు బస్సు సౌకర్యం లేదు. వనదుర్గాపురం, సింహరాజుపురం, బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురం, గంగమాంబాపురం, కోదండరామాపురం, నరసింహాపురం పంచాయతీలకు పూర్తిగా బస్సులు లేవు. ఇక్కడి ప్రజలకు ద్విచక్ర వాహనాలు, ఆటోలే దిక్కు. బస్సు ఎక్కాలంటే 4-5 కి.మీ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అదే సమయంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా ఇక్కడి గ్రామాలు అభివృద్ధి చెందడం లేదు. కనీస మౌలిక సదుపాయాలు లేవు. కొబ్బరి ఎక్కువగా పండే ఈ మండలంలో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్న నాయకుల హామీలు నీటి మూటలయ్యాయి. యువత జీవనోపాధి కోసం తమిళనాడులోని చెన్నై, తిరుత్తణి, షోలింగర్, కర్ణాటకలోని బెంగళూరుకు వలస వెళుతున్నారు. జిల్లా కేంద్రానికి పాలసముద్రం దగ్గరగా ఉన్నా ఉన్నతాధికారులు ఇటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. ఇక్కడ పని చేసే అధికారులు సైతం సమీపంలోని పట్టణ ప్రాంతాల్లో నివాసముంటున్నారు. మండలానికి ఆనుకుని ఉండే తమిళనాడు ప్రాంతంలో రవాణా, రోడ్లు, వైద్య సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ మండలం వైపు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ వహించండి



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, ఆగస్టు 11: ప్రజారోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశించారు. ఆదివారం బంగారుపాళ్యం దళితవాడలో డయేరియాతో బాధపడుతున్న బాధితులను టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌వీ జయప్రకాష్‌తో కలిసి పరామర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్దకు చేరుకుని వైద్య సిబ్బందితో మాట్లాడుతూ రోగుల పట్ల అశ్రద్ధ వహించరాదన్నారు. ఎలాంటి సాయం అవసరమైనా చేసేందుకు ప్రభుత్వం వెనుకాడదని తెలిపారు. గ్రామంలో తాగునీటి క్లోరినేషన్, మురుగునీరు కాల్వలను శుభ్రపరచాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే నిర్వహించి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లోహిత్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విగ్రహాలపై దాడి సంస్కృతి టీడీపీది కాదు

చిత్తూరు సిటీ, ఆగస్టు 11: విగ్రహాలపై దాడిచేసే సంస్కృతి టీడీపీకి లేదని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు మాజీ సీఎం జగన్ పేరు తొలగించగా దాన్ని ప్రభుత్వానికి ఆపాదించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హతగాని, విగ్రహాన్ని తాకే హక్కుగాని జగన్‌కు, వైసీపీ నేతలకు లేదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజ్యాంగాన్ని గౌరవించారా, అమలు చేశారా అని ప్రశ్నించారు. రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసిన ఫ్యూడలిస్టు జగన్ అని విమర్శించారు. అంబేద్కర్ విదేశీ విద్యతతో పాటు 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి అంబేద్కర్‌ను అవమానించి, దళిత వర్గాలకు ద్రోహం చేసిన దళిత ద్రోహి జగన్ అని దుయ్యబట్టారు.

● అంబేద్కర్‌ను అవమానించిన వ్యక్తి మాజీ సీఎం జగన్ అని ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి విమర్శించారు. దళితుల హక్కులను కాలరాసి, ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేసిన దళిత ద్రోహి జగన్ అని వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

జగన్‌కు మతి భ్రమించింది : టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 11: మాజీ సీఎం జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ విమర్శించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ జగన్ ఎక్స్‌వేదికగా టీడీపీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రెండు నెలల పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని, వైసీపీ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయని రాష్ట్రపతి పాలన విధించాలని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు, దాడులు చేసిన సంగతి ప్రజలు ఇంకా మరచిపోలేదని చెప్పారు. తప్పులు చేసిన వైసీపీ నేతలు, అధికారులు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

వైసీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 11: గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి మాజీ సీఎం జగన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు తీరని ద్రోహం చేసారని రిటైర్డ్ ఎస్పీ, టీడీపీ నేత పి.చిన్నస్వామి విమర్శించారు. స్వార్థం కోసం అమరావతి స్మృతివనంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం కింద నేమ్ బోర్డులో రాజ్యాంగ నిర్మాత పేరుకంటే జగన్‌రెడ్డి పేరును పెద్ద అక్షరాలతో వేసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే అమరావతిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని ఆరోపించారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరును తొలగించి జగనన్న విదేశీ విద్యగా పేరు ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ జిల్లాగా పేరుపెట్టి కులాల మధ్య చిచ్చుపెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

టీడీపీ కార్యకర్తపై దాడి కేసు విచారణ



బాధితులను విచారిస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

పూతలపట్టు, ఆగస్టు 11: టీడీపీ కార్యకర్తను కులం పేరుతో దూషించిన ఘటనపై చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆదివారం విచారణ చేపట్టారు. మండలంలోని పోటుకనుమ దళితవాడకు చెందిన చందు టీడీపీ కార్యకర్త. పాతకక్షలకు సంబంధించి పంచాయితీ చేసేందుకు ఈనెల 5వ తేదీన ఇరువర్గాలను పిలిచేందుకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న తలుపులపల్లి గ్రామానికి చెందిన తరుణ్ రెడ్డి, జ్యోతిరెడ్డి, లోకనాథరెడ్డిలు అతనికి ఫోన్ చేసి 'పంచాయితీలు చేసేంత మగాడివైపోయావా' అని కులం పేరుతో దూషించారు. తలుపులపల్లి గ్రామానికి పిలిపించి, దాడి చేశారు. చందు ఫిర్యాదు మేరకు సీఐ సుదర్శన్ ప్రసాద్ వారి ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆదివారం పోటుకనుమ దళితవాడకు వెళ్లి బాధితుడి నుంచి సమాచారం సేకరించారు. అనంతరం గొడవ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు పూతలపట్టు ఏఎస్‌ఐ రమణారావు ఉన్నారు.

ధర్మరాజుల తిరునాళ్లలో ఎమ్మెల్యే భానుప్రకాష్



ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నగరి/విజయపురం, ఆగస్టు11: నగరి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఆదివారం జరిగిన తిరునాళ్లలో ఎమ్మెల్యే భానుప్రకాష్ పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు చింతలపట్టెడ ధర్మరాజుల ఆలయ తిరునాళ్లలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. నగరి మండల పరిధిలోని గుడ్డికండ్రిగ గ్రామంలో లక్ష్మమ్మ తిరునాళ్లలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి భానుప్రకాష్‌ను సన్మానించారు. బుగ్గఅగ్రహారం ఆదిఆంధ్రవాడ మాతమ్మ తిరునాళ్లలో పాల్గొన్నారు. బీరకుప్పంలో టీడీపీ నాయకుడి ఇంట్లో కేశఖండనలో పాల్గొన్నారు. విజయపురం మండలం కాళికాపురంలో కేశ ఖండన కార్యక్రమానికి హాజరై మునీశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, నాయకులు మురళీరెడ్డి, నారాయణస్వామినాయుడు, వేణు, పెరుమాళ్, సెల్వమణి పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు కొమ్మలు తగలకుండా చూడండి

గుడిపాల, ఆగస్టు 11: విద్యుత్ లైన్లకు కొమ్మలు తగలకుండా చూడాలని ట్రాన్స్‌కో ఏడీఈ పద్మనాభపిళ్లై కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ తీగలకు తగులుతున్న కొమ్మలను పరిశీలించి, వాటిని తొలగించాలని ఆదేశించారు. మళ్లీ అటువంటి సమస్య రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

ఆలయాభివృద్ధికి సహకరించండి

గుడిపాల, ఆగస్టు 11: మండలంలోని పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ చైర్మన్ గుర్రప్ప నాయుడు కోరారు. ఆదివారం ఏఎల్ పురం ఓంశక్తి ఆలయం వద్ద కమిటీ సమావేశం నిర్వహించారు. మెట్ల నిర్మాణం, విద్యుత్, తాగునీరు తదితర వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. సమావేశంలో కార్యదర్శి తారకరామ్, కమిటీ సభ్యులు రమేష్, రాజు, సురేంద్ర నాయుడు, డిల్లీబాబు, భూపాల్ నాయుడు, తేజశ్రీ, సుబ్రహ్మణ్యం, మురళి పాల్గొన్నారు.

బస్సు వేళలు మార్చండి

గుడిపాల, ఆగస్టు 11: విద్యార్థుల సౌకర్యార్థం మండలంలోని చిత్తపార - బండపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు వేళలను మార్చాలని నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్‌పర్సన్ టీఆర్ ఢిల్లీబాయి, ప్రధానోపాధ్యాయురాలు ఖాతుంబీ కోరారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు పాఠశాల వదులుతారని, బస్సు 6 గంటలకు రావడంతో దాదాపు 50 మంది విద్యార్థులు రోడ్లపై పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటలకు స్కూల్ వద్దకు బస్సు చేరేవిధంగా చూడాలని కోరారు.

బిందుసేద్యంపై అవగాహన

పెనుమూరు, ఆగస్టు 11: శాతంబాకం పంచాయతీలోని పలు గ్రామాల్లో రైతులకు బిందు సేద్యం ఉపయోగాలపై అవగాహన కల్పించారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు సాగుచేయడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుందని జిల్లా బిందుసేద్య ఏపీడీ ఫజులూన్ తెలిపారు. 5 ఎకరాల లోపు రైతులకు 90 శాతం, అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు 70శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉద్యానవన సహాయకురాలు సంధ్య, ఎంఏవో దొరబాబు, టెక్స్‌మో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌లో సీఎం ఫొటో ఎక్కడ?

బంగారుపాళ్యం, ఆగస్టు 11: బంగారుపాళ్యం పోలీసు స్టేషన్‌లో సీఎం చంద్రబాబు ఫొటో పెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. అన్ని కార్యాలయాల్లో పెట్టాలని ప్రభుత్వం నమూనా ఫొటోలు పంపించినా ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఫొటో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



సమావేశానికి హాజరైన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు, ఆగస్టు 11: ప్రభుత్వ డ్రైవర్లందరూ నిబంధనలు పాటించాలని ప్రభుత్వ డ్రైవర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం కోరారు. సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం సారథి కల్యాణ మండపంలో నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలపై చర్చించారు. జనరల్ సెక్రటరీ రోషన్ బాషా, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు, సలహాదారు రామన్న, నేతలు ప్రకాష్, బాలాజీ, కుమార్, హరి, సురేష్‌బాబులు పాల్గొన్నారు.



వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం పేరును కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రంగా మార్చింది. అయితే బంగారుపాళ్యం మండలం మహాసముద్రంలో మాత్రం ఇప్పటికీ అదే పేరుతో కొనసాగుతుండడం విమర్శలకు తావిస్తోంది.



చిత్తూరు-పెనుమూరు మార్గంలో మోపిరెడ్డిపల్లి వద్ద..



పెనుమూరు-నేంద్రగుంట మార్గంలో రాజావారిఇండ్లు వద్ద..

మలుపు రోడ్లతో ముప్పు

పెనుమూరు, ఆగస్టు 11: పెనుమూరు మార్గంలోని ప్రధాన రహదారుల్లో మలుపుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చిత్తూరు-పెనుమూరు మార్గంలో బీసీకాలనీ, రాణావేణుగోపాలపురం, కావూరివారిపల్లి, మోపిరెడ్డిపల్లి, శాతంబాకం, పూనేపల్లిక్రాస్ వద్ద మలుపులున్నాయి. పెనుమూరు-నేంద్రగుంట మార్గంలో గుట్టకిందపల్లి, గోపాలపురం, రాజావారిఇండ్లు, క్యాటిల్‌ఫారం వద్ద మలుపులున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి సూచిక బోర్డులూ లేకపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.